# ఆంధ్రజ్యోతి
## రచన: తోలేటి

జయహే జయహే
జయ జయా అంధ్రమాతా
జయ జయా అంధ్రమాతా
పెన్న కృష్ణా తుంగభద్రా
మిన్న గోదావరి చిరు తరగల
తిన్నని సన్నని తీయని పాటల
తేనెలొల్కునమ్మా తెలుగుల
వాణి పల్కునమ్మా

ఉత్సాహం ఉపకారం ప్రజ్ఞా
తత్సంగం సత్యం సమభావం
గోరుముద్దలుగ నీ పాపలకిడి
పేరు గాంచితమ్మా నీకిల
లేరు సాటి సుమ్మా

పాడి పంటా భాగ్య సంపదా
ఈడులేని నవరత్న సంపదా
అన్ని దేశముల పంచి పెంచు మా
కన్న తల్లివమ్మా
అన్నపూర్ణవమ్మా || జయహే ||

బమ్మెర పోతన భాగవతములో
కమ్మని తిక్కన కవి భారతములో
మర్మమెఱింగిన వేమన గీతిలో
మాటలు కావమ్మా స్వర్గపు బాటలేను సుమ్మా

అజంతా ఎల్లోరా అమరావతి
హంపి వివిధ శిల్ప
విచిత్ర విరాజితాలూ
తెనుగు తల్లికి ప్రకృతి నీరాజనాలు

తీయని పాటల త్యాగయ్య భక్తి
కోయిల మాటల క్షేత్రయ్య రక్తి
తెలుగువారి సంగీత కళ కహూ
వెలుగు గూర్చి రమ్మా! రతనపు
జిలుగు పేర్చిరమ్మా!
పాటలిపుత్రపు కోట కొమ్మపై
సాటిలేని విద్యా నగరముపై
దీటుగ నీటుగ నాట్యమాడు నీ
తెనుగు తల్లి జెండా
అనుగు తల్లి జెండా

వేసినారోయి నీ వీరేశలింగము
రఘుపతి రత్నాల రాచబాట
నడిపిచినారోయి గిడుగుల గురజాడ
జాతీయ ముత్యాల సరుల త్రోవ
మెరపించినారోయి చురకత్తులటు దుగ్గి
రాల, సీతారామ రాచబంట్లు
కదలించి నారోయి ఖండాంతరపు కళల్
దామెర్ల కలియుగ భీమ జంట

క్రొత్త త్రోవలు చూపి చేయెత్తి నిలచి
జల్లు చున్నారదే శుభాక్షతలు పైన
విశ్వదాతగ నీ ప్రేమ వెల్లు జూపి
దేశమున శాంతి నిల్పుమో తెనుగు వీర!

ఆంధ్రుల చరితం అతిరస భరితం
ఆంధ్రులార! ఇటు వినరయ్యా!
ఆంధ్ర నవ్య చారిత్రము వింటే
అదరు గుండియలు కనరయ్యా! ॥ఆంధ్రుల॥

టంగుటూరిలో తరగని ధైర్యం
బులుసు వారిలో వెలిగెడి దీక్ష
వెంకటగిరిలో వెలయు సాహసము

రంగనాయకు రైతభిమానం
ఆంధ్రుల చరితలో చిరస్థాయిగా
అలరు చుండునని తెలియండి ॥ఆంధ్రుల॥

జాతివర్గ విసపూరిత భేదాల్
చంపి యేకమై మెలగండోయ్
చేతులు చేతులు కలిపిన తెలుగుల
ఖ్యాతి కెదురు లేదిక లెండోయ్ -- తెలుగుల
ఖ్యాతి కెదురు లేదిక లెండోయ్
మాటలెల్ల విడనాడి దేశమును
మనసారగ ప్రేమించండోయ్
మట్టిగాదు దేశము మనుజులగని
మాతృభూమి పూజించండోయ్
దేశ దేశముల మించండోయ్
భరత జాతీయ సంగ్రామ చరిత వ్రాసీ
మేటి కాంగ్రెసు గద్దెపై మెరసినాడు
నీ కుమారుడు పట్టాభి నీ యశస్సు
దేశదేశాల వెదజల్లు తెలుగు తల్లీ ॥